# అపశృతిలో శృతి

-బోడపాటి రమేష్

'డామిట్.రోజు రోజుకి కాంచనకు అలుసైపోతున్నాను'అని ఇంకొకసారి గొణుక్కున్నాడు కృష్ణ.

కృష్ణ, కాంచన పెళ్ళికాక ముందు చాలా అన్యోన్యంగా ఉండేవాళ్ళు (?) చాలా కాలం కిందటే వాళ్ళిద్దరికీ పరిచయం ఏర్పడి ప్రేమవలయంలో చిక్కుకుని పెళ్ళిచేసుకుని బయటపడ్డారన్నమాట.

నువ్వు దొరకడం నా సుకృతం,నేను దొరకడం నీ అదృష్టం అని ఒకరినొకరు పొగుడుకున్నారు. మాటలు లేని పాటలు పాడుకున్నారు.

సవ్యంగా జరుగుతున్న వీళ్ళ కథ పెళ్ళైన తర్వాతనే ఊహించని మలుపులు తిరగడం మొదలుపెట్టింది. ప్రణయకలహాలతో మొదలయి అర్థంలేని ప్రళయ కలహాలకు దారి తీసింది. కారణాలు అంటూ ఏమీ ఉండవు. ఏమయినా అన్నా వద్లగింజలో బియ్యపు గింజ, పాలలో నీళ్ళలాంటివి.

కాంచన కూడా ఉద్యోగస్థురాలవడంవల్ల తనంటే భార్యకు లెఖ్ఖలేదని కృష్ణ చాలాసార్లు అనుకునేవాడు. దానికి తగ్గట్టుగా ఏదయినా సందర్భం వస్తే కాంచన కూడా అంటూ ఉండేది "అనవసరంగా నోరు పారేసుకోకండి. నేను కూడా మీలాగే ఉద్యోగం చేస్తున్నాన"ని.

కృష్ణ (దౌర్) భాగ్యమేమోకాని అతనిది గవర్నమెంట్ ఉద్యోగం.భార్యది ప్రైవేట్ ఉద్యోగం అవడంవల్ల ఆమెకు భత్యం, కరువు భత్యం, ఇతర భత్యాలు కూడా ఎక్కువే ఉండేవి. అది గ్రహించిన కృష్ణ ఇంకా కృంగి పోవడం మొదలుపెట్టాడు. కాంచనకు అలుసయిపోతున్నానని అనుకోవడం మొదలుపెట్టాడు. అదే అతనికి క్రమేపీ అలవాటయిపోయింది.

ఆ ముందురోజు సాయంత్రమే భార్యతో చెప్పాడు. "రేపు ఉదయాన్నే క్యాంప్‌కి వెళ్ళాలోయ్" అని.

"వెళ్ళండి మీకెప్పుడూ అలవాటే కదా" అని అంది.

"అది కాదు పొద్దున్నే కొంచెం కాఫీ, టిఫిన్ చేస్తావేమోనని" అంటూ నసిగాడు.

"మీకు అర్థరాత్రి, అపరాత్రి వండి వార్చటానికి ఇక్కడ ఎవరికీ తీరికలేదు" అని ముసుగుపెట్టేసింది భార్యామణి.

మర్నాడు ఉదయాన్నే క్యాంప్‌కి వెలుతున్నాను కదా ఒకటిరెండు రోజులకిగానీ రాకపోవచ్చు. ఏదో 'సరదాగా' గడుపుదామని సంబరపడ్డ కృష్ణకు భార్య ముసుగుపెట్టి పడుకోవటంతో సరదా నీరుకారిపోయింది.

క్యాంప్ నుండి తిరిగి వస్తున్న కృష్ణకు రిస్ట్‌వాచ్ చూసుకుంటే రాత్రి పదిగంటలు అవుతోందని తెలిసింది. అసలే చలికాలం. ఇప్పుడు ఇంటికి వెళితే ముసుగుతన్ని పడుకునే భార్య ఇంటి తలుపు తీయటం కూడా అనుమానమే. అందువల్లే అనుకున్నాడు 'డామిట్ రోజు రోజుకి అలుసయిపోతున్నాన'ని రైలు స్టేషన్ నుండి బయటకు అడుగుపెడుతూ.

ఛ నేను ఆడదానికి అలుసయిపోవటమేమిటి నాన్‌సెన్స్ అనుకుంటూ ఆమెను సాధించటం ఎలా అనే ఆలోచనలో పడ్డాడు. కొద్దిసేపట్లోనే అతనికి

---

## భావలోకాలోకనం

ఆహ్వానిస్తున్నాయి భావాలు
ఆరాధిస్తూ లోనికి రమ్మని
భావలోకం స్వర్గలోకం కన్న అందమైంది
ఆ లోకంలోకి వెళ్లాలంటే
ఆలోకనం అనే అర్హత ఉండాలి
లోకాన్ని చూసే వాళ్లందరూ
ఆలోకాన్ని చూడలేరు
ఏ లోకాలలో దొరకనిదీ
భూలోకవాసులకే లభ్యమయ్యేదీ
ఆ లోకం! అదే ఆలోకం!!
లోచనాల వెనుక ఉండేదీ
'సు'లోచనాలకే అందేదీ
సురుచిరా లోకం!
సుజనులకే అది నాకం
దాని కౌగిలిలో కరిగిపోని కవిలోకం
ఈ లోకంలో లేదనేది సత్యం
దాన్ని చూస్తే చాలు
తరగని ఆనందం తథ్యం!!

-డా॥ అయాచితం నటేశ్వరశర్మ

తళుక్కుమనే ఆలోచన తట్టింది.

"ఏయ్ రిక్షా" అన్నాడు ఎదురుగా ఖాళీగా పోతున్న రిక్షాను.

రిక్షా ఆగడంతో "వస్తావా" అన్నాడు.

"రండి బాబూ" అంటూ రిక్షా అతను సీటు గుడ్డతో తుడిచి కూర్చోమన్నాడు.

"ఎక్కడకు పోమ్మంటారు" అన్నాడు కృష్ణని.

రిక్షా కదిలింది. మెయిన్‌రోడ్డు మీదకు వచ్చింది. రిక్షా అతనికి ఎక్కడికెళ్ళాలో అర్థంకావటంలేదు.

"ఎక్కడికి పోనిమ్మంటారు" ఇంకొకసారి అడిగాడు బిక్కుబిక్కుమంటూ.

"ఏదయినా మంచిచోటుకి తీసుకెళ్ళు" అన్నాడు కృష్ణ.

రిక్షా ఆపాడు వెనక్కి తిరిగి కృష్ణని చూశాడు. వీధి లైటు వెలుతురులో కృష్ణ ముఖం మసగ్గా కనిపించింది.

"బాబూ తమరు ఈ ఊరికి కొత్తనుకుంటాను"

కృష్ణకు మనసు కుదుటపడింది. తను ఈ ఊరివాడి నని రిక్షా అతనికి తెలియదు.

"అవునోయ్. ఏదో వ్యాపారం పనిమీద ఈ ఊరో చ్చాను. అసలు ఈ ఊరు విశేషాలేమిటి" అన్నాడు అమాయకత్వం నటిస్తూ.

రిక్షా సాఫీగా సాగిపోతోంది. "ఇంత రాత్రిపూట విశేషాలేముంటాయి బాబూ అది తప్పించి. ఇంతకూ తమకు ఎలాంటి వారు కావాలి. లాడ్జింగ్‌కు తీసుకెళ తారా... ఏ గుడిసెలోనయినా కానిచ్చేస్తారా" అంటూ తనకు తెలిసిన విషయాలు చెప్పాడు.

కృష్ణ మనసు పరిపరివిధాల పోయింది. ఒకవేళ ఏదయినా కక్కుర్తిపడితే అరగంట భోగం జీవితమంతా రోగం అవుతుందేమో. అందులో ఎయిడ్స్ అంటూ అందరూ ఊదరగొడుతున్నారు అయినా బింకంగా.

"ఏదయినా ఫ్యామిలీటైప్ ఇంటికి తీసుకుపోవోయ్" అన్నాడు.

"అళ్ళు ఇంతసేపు ఖాళీగా ఉండరు బాబూ ఈపాటికి ఎక్కడో ఒప్పేసుకుని లైట్లార్పేస్తారు. ఇదిగో అణాకానీ గాంగే తెల్లవార్లూ రోడ్లమీద కాపేస్తారు. అయినా మీలాంటోళ్ళకు ఆళ్ళొద్దు బాబూ. ఒళ్ళు గుల్లయి పోతుంది" రిక్షా,తన వాగ్ధాటి రిక్షాతో పోటీ పడుతోంది.

కృష్ణ నవ్వుకున్నాడు. తన ఆరోగ్యం గురించి ఆలో చించే రిక్షా అతనిని చూస్తే ముచ్చటేసింది. రిక్షా దిగగానే అతనడిగిన దానికంటే ఎక్కువ ముట్టజెపుదామను కున్నాడు. అయితే భార్యను ఏదోరకంగా సాధించాలనే దుగ్ధ కృష్ణని స్థిమితంగా ఉంచటంలేదు.

"చూడు నీకు కావలసినంత డబ్బులిస్తాను. కొంచెం రేటు ఎక్కువయినా ఫరవాలేదు. ఏదయినా ఫ్యామిలీ టైపు ఇంటికే తీసుకెళ్ళు" అన్నాడు.

"మీరంత ముచ్చటపడితే నేనెవరిని బాబూ కాదన టానికి" అన్నాడు రిక్షా సామి.

కొంతసేపటికి "దిగండి బాబూ" అన్నాడు.

రిక్షాలో నుండి కిందకు దిగిన కృష్ణ "ఇదేమిటి మా ఇంటి ముందు ఆపావు" అన్నాడు.

రిక్షా అతను గతుక్కుమన్నాడు. అయినా సర్దుకుని...

"అవును బాబూ నేను మిమ్మల్ని చూశాను.కాని ఏమీ మాట్లాడలేదు. అయినా నాకు మీ ఇల్లు తెలుసు కదా. ఇంత రాత్రేళ ఇంటికి కాకుండా ఎక్కడికి పోతా రని బయలుదేరాను. దోవలో మీ మాటలు విన్నాను. అయినా నిక్షేపంలాంటి అమ్మగారుంటే మీకెందుకు బాబూ అటువంటి ఎదవాలోచన్లు. ఇంట్లోకెళ్ళండి బాబూ లైటెలుగుతూనే ఉంది. అమ్మగారు మీకోసం కాసుకున్నట్టున్నారు" అంటూ కృష్ణను ఇంట్లోకి సాగనంపాడు.

'డామిట్ రిక్షా వాడికి కూడా అలుసయిపోయాను' అనుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయాడు రిక్షా కిరాయి అయినా ఇవ్వకుండా.

'అమ్మయ్య' అనుకున్నాడు రిక్షా అతను గుండె నిండుగా గాలి పీల్చుకుని, అలుపు తీర్చుకుంటూ. ఆయన అదృష్టం బాగుండి ఇంటికే తీసుకొచ్చాను ఎవరో తెలియకపోయినా. కిరాయి రేపయినా తీసుకో వచ్చు, కాని మనిషి ఉండాలి అనుకుంటూ వెళ్ళి పోయాడు చీకటిని చీల్చుకుంటూ. ■

## 'కవిత్వం' 'అవినీతి' నిండింది

కాసుల రేసులో ప్రభుత్వం నడుస్తుంది
యథారాజా, తథా ఉద్యోగి అంటూ, సదరు ఉద్యోగి
అవినీతి పల్లకి ఎక్కాడు
ఏదొక సమ్మెతో, సరుకుకు రెక్కలు వచ్చాయి
ఇడ్లీ మొదలు రెడ్డి తలపాగ వరకు
కల్తీ, వెల్తీ కనపడుతుంది
కవి, దేనిని గురించి వ్రాస్తాడు, ఒకతను ఆలోచన
అవినీతిపై సారించాడు
కవిత్వం సైతము, అవినీతితో పోటీపడుతుంది

–వాస్తు రామచంద్ర